దేవరుప్పులలో మాట్లాడుతున్న పల్లా సుందరరాంరెడ్డి

ప్రశ్నించే గొంతుకలపై కక్షపూరిత ధోరణి తగదు

బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందరరాంరెడ్డి

దేవరుప్పుల, జనవరి 11 : రాజ్యాంగంలో పత్రికా స్వేచ్ఛకు అత్యంత ప్రాధాన్యతనివ్వగా తెలంగాణలో అందుకు విరుద్ధంగా ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతున్నారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందరరాంరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో బీఆర్ఎస్ సోషల్ మీడియాపై ఉక్కుపాదం మోపాలని చూస్తున్నదన్నారు. ముఖ్యంగా పాలకుర్తి నియోజకవర్గంలో గిరిజన మీడియాపై ప్రభుత్వం దాడులు చేయిస్తున్నదని, దీన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై రైతులు, మహిళలు, ఇతర వర్గాల అభిప్రాయాలను యూ ట్యూబర్ ఆర్జీ టీవీ రాజ్‌కుమార్ ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ఎత్తిచూపితే అతనిపై కక్ష కట్టి అర్ధరాత్రి అతని ఇంటిపై పోలీసులు దాడులు చేసి అక్రమంగా అరెస్ట్ చేసి తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను వ్యక్తం చేస్తున్న ప్రజల వాణిని నేరుగా వారి నుంచి సేకరించి ప్రభుత్వం దృష్టికి తేవడానికి సోషల్ మీడియాను వేదికగా వాడుకుంటున్న గిరిజన యువకులు ఉపేందర్, రాజ్‌కుమార్‌లపై అక్రమంగా కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్న ఈ ప్రభుత్వంపై గిరిజనులు తిరగబడే రోజులు వస్తాయన్నారు.

కలెక్టరేట్‌లో వడ్డె ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రవీందర్, తదితరులు

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

జనగామ చౌరస్తా, జనవరి 11 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంచార జాతులను ఏకం చేసిన మహావీరుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి బీ రవీందర్ హాజరై ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన ఓబన్న, రాయలసీమ పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి బ్రిటీషర్లపై సాయుధ పోరాటం చేసినట్లు తెలిపారు. ఈ పోరులో వడ్డెరలు, బోయలు, చెంచులతో సంచార తెగల సైన్యానికి ఓబన్న నాయకత్వం వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శివరాత్రి సత్తయ్య, జిల్లా అధ్యక్షుడు శివరాత్రి కుమార్, కార్యదర్శి పల్లపు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విద్యుత్ లైన్‌మెన్ మృతి

తిరుపతి(ఫైల్)

జఫర్‌గఢ్, జనవరి 11 : మండలంలోని కూనూరులో విద్యుత్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న నరిసెట్టి తిరుపతి (47) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కూనూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న తిరుపతి ప్రతిరోజూ మాదిరిగానే విధులకు ఇంటికి నుంచి బయలు దేరాడు. ఈ క్రమం లో ఛాతీలో నొప్పి రావడంతో తీవ్ర అస్వస్థతకు గురి కాగా స్థానికులతో కలిసి కుటుంబ సభ్యులు తిరుపతిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. తిరుపతికి గుండెపోటు తీవ్రం కావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తిరుపతి మరణంతో కూనూరులో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడు తిరుపతి స్వగ్రామం ధర్మసాగర్ మండలంలోని మల్లక్‌పల్లి. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- **జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**
- **ప్రభుత్వ పథకాలపై అధికారులతో సమీక్ష**



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, జనవరి 11 : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి స్థానిక సంస్థలు, రెవెన్యూ అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రభుత్వ పథకాల విధివిధానాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో జూమ్ యాప్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26 (రిపబ్లిక్ డే) నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, కొత్త ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి నాలుగు కొత్త పథకాలను ప్రారంభిస్తుందని తెలిపారు. రైతు భరోసా పథకం కింద వ్యవసాయ సాగు యోగ్యమైన భూములకు ఎకరానికి రూ.6వేల చొప్పున రెండు విడతల్లో రూ.12 వేల నగదు చెల్లిస్తున్నదని పేర్కొన్నారు. భూ భారతి (ధరణి) పోర్టల్‌లో నమోదైన సాగు భూములకు మాత్రమే రైతు భరోసా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో భూముల వివరాలు సేకరించి, 16నుంచి రెవెన్యూ గ్రామాల వారీగా ఏఈవో, ఆర్ఐ, సర్వేయర్లు బృందంగా ఏర్పడి విధులు నిర్వహించాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబానికి రూ.6వేల చొప్పున రెండు విడతల్లో రూ.12వేల నగదు చెల్లిస్తుందన్నారు. 2023-24 సంవత్సరానికిగాను కనీసం 20రోజులు ఉపాధి హామీ పని దినాలు పూర్తి చేసుకున్న భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. కొత్త రేషన్‌కార్డులు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కులగణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్‌కార్డులు లేని పేద కుటుంబాల జాబితా ప్రకారం లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియను పరిశీలించాలన్నారు. దీనికి అదనపు కలెక్టర్ రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు పర్యవేక్షకులుగా వ్యవహరించాలని సూచించారు. మండలస్థాయిలో ఎంపీడీవో, మున్సిపల్ పరిధిలో కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారన్నారు. భూములు, ఆదాయం ఇతర అంశాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు గుర్తించాలని, కుటుంబాల వివరాలను పంచాయతీ కార్యదర్శులు సేకరించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జీవో నంబర్ 7 ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న గృహాల వారికి, ఇండ్లు లేని వారికి, పూరి గుడిసెలు, అద్దె నివాసాల్లో ఉన్నవారికి, ఇంటి నిర్మాణానికి ఖాళీ స్థలం ఉన్నవారు అర్హులు అని తెలిపారు. మట్టి గోడలు, పైకప్పులేని గృహాలు, వితంతువులు, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుధ్య కార్మికులు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 18 లోగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ లాగిన్‌లో ఎలాంటి లోపాలు దొర్లకుండా సూపర్ చెక్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ జూమ్ యాప్ సమావేశంలో ఆర్డీవో గోపీరామ్, యూనిట్ 1, 2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్‌నాయక్, డీఆర్డీవో వసంత, డీపీవో స్వరూప, డీఏవో రామారావునాయక్ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మద్యం తాగి వాహనం నడుపరాదు

జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో ఎస్సై శ్రీదేవి

తరిగొప్పుల, జనవరి 11 : మద్యం తాగి వాహనాలు నడుపరాదని ఎస్సై శ్రీదేవి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, కారులో ప్రయాణించేటప్పుడు డ్రైవర్‌తోపాటు పక్కన కూర్చున్న వ్యక్తి కూడా సీటు బెల్టు ధరించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి స్పీడ్ పరిమితికి మించి వాహనాలను నడుపరాదన్నారు. అతివేగం ప్రమాదకరమని దీనినిపై వాహనదారులు అవగాహన కల్గి ఉండాలన్నారు. టూ వీలర్స్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి వాహనదారుడు ఆర్‌సీ, రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ కల్గి ఉండాలన్నారు. లేని పక్షంలో జరిమానాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా సాధన శిబిరం

జఫర్‌గఢ్, జనవరి 11 : జఫర్‌గఢ్‌లో నేటి (ఆదివారం) నుంచి 21రోజులు యోగా సాధన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యోగా ఆచార్యులు రాజుబాపూజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జఫర్‌గఢ్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో ప్రతి రోజూ ఉదయం 6నుంచి 7గంటల వరకు యోగా తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యోగా సాధనతో శారీరక, మానసిక రుగ్మతులకు చక్కటి పరిష్కార మార్గం దొరుకుతుందన్నారు. షుగర్, బీపీ, థైరాయిడ్, ఆస్తమా, అధిక బరువు, బ్యాక్‌పేయిన్, నరాల బలహీనత, కీళ్ల నొప్పులు యోగా సాధనతో 21రోజుల్లో కచ్చితమైన పరిష్కారం లభిస్తుందని రాజుబాపూజీ తెలిపారు. జఫర్‌గఢ్‌తోపాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉచిత యోగా తరగతులకు హాజరు కావాలని ఆయన కోరారు. వివరాలకు 9440593793లో సంప్రదించాలని సూచించారు.

గౌడ కులస్తులు ఐక్యతతో ముందుకు సాగాలి

గోపా జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రఘునాథపల్లి, జనవరి 11 : గౌడ కులస్తులు ఐకమత్యంతో ముందుకు సాగాలని గోపా జిల్లా అధ్యక్షుడు మేకల పోతుల ఆంజనేయులుగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం గోపా సభ్యులు, గౌడ సంఘం పెద్దలతో కలిసి ఆయన గోపా నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గోపా మండల అధ్యక్షుడు పుల్ల రవిగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గోపా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి గౌడ విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తామన్నారు. సమావేశంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మాజీ ఎంపీపీ వై కుమార్‌గౌడ్, నాయకులు మల్కపురం లక్ష్మ య్యగౌడ్, నామాల బుచ్చ య్యగౌడ్, గైని శ్రీనివాస్‌గౌడ్, ముప్పిడి శ్రీని వాస్‌గౌడ్ కుర్ర సురేందర్‌గౌడ్, కోళ్ల రవిగౌడ్, బైరగోని శ్రీనివాస్, దుబ్బాక నాగేశ్, రంగు రాజు, కోళ్ల సాయి, మల్కపురం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు

రఘునాథపల్లి, జనవరి 11 : భూ వివాదంలో ఒకరిపై హత్యాయత్నానికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాఫర్‌గూడెంకు చెందిన అనుముల మల్లయ్య అనే రైతు వద్ద 2021 సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన కర్నె అశోక్ 17గుంటల వ్యవసాయ భూమిని రూ.9.77లక్షలకు కొనుగోలు చేశాడు. బయానగా అశోక్ రూ.6లక్షలు ఇచ్చి భూమిని కాస్తు చేసుకుంటున్నాడు. ఏండ్లు గడిచినప్పటికీ మల్లయ్య భూమి రిజిస్ట్రేషన్ చేయడంలో నిర్లక్ష్యం చేయడంతోపాటు తన భూమి తనకు ఇవ్వాలని అశోక్‌తో గొడవ చేసేవాడు. దీంతో అశోక్ ఈనెల 10న శుక్రవారం తన ఆధీనంలో ఉన్న భూమిని దున్నిస్తుండగా మల్లయ్య, అతడి కుమారుడు రాజు, మల్లయ్య తమ్ములు అనుముల నర్సయ్య, అనుములు రాములు కలిసి అశోక్ తలపై కర్రతో కొట్టి హత్యాప్రయత్నం చేశారు. పక్కనే ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ చింత భాస్కర్, కూలీ పనికి వచ్చిన దేవరాయి పోషయ్య అడ్డుపడుతుండగా వారిపై చేయి చేసుకున్నారు. బాధితుడి భార్య కర్నె సుగుణ ఫిర్యాదు మేరకు అశోక్‌పై దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమతిలేని ఇసుక ట్రాక్టర్ సీజ్

దేవరుప్పుల, జనవరి 11 : ఎలాంటి అనుమతులు లేకుండా మన్‌పహడ్ గ్రామం నుంచి ఇసుకను ట్రాక్టర్‌తో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. దేవరుప్పుల శివారు దాదాసాహెబ్ కాలనీకి చెందిన షేక్ కాసీం తన ట్రాక్టర్‌తో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఖాసీంపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

యూత్ అధ్యక్షుడు రాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసిన యూత్ నాయకులు

తరిగొప్పుల జనవరి 11 : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని రేయింబో యూత్ సభ్యులు శనివా రం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే పల్లాను వారు శాలువాతో సత్కరించారు. మండలంలోని అక్కరాజుపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని యూత్ సభ్యులు ఎమ్మెల్యేను కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించి తన కోటా నుంచి నిధులు కేటాయించి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు యూత్ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యూత్ అధ్యక్షుడు అంకం రాజు, సభ్యులు జొన్నగోని రాజు, బోగం అనూఫ్, హరిప్రసాద్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన బాలరాజు

హరీశ్‌రావుతో బాలరాజు

బచ్చన్నపేట జనవరి 11 : తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును ఆయన అభిమాని కుందెన బాలరాజు హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలరాజు హరీశ్‌రావుకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. లింగంపల్లి అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని హరీశ్‌రావును కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారని బాలరాజు తెలిపారు.

జవాన్ తిరుమల్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

దేశ సేవకు యువత ముందుకు రావాలి

రిటైర్డ్ ఆర్మీ జవాన్ తిరుమల్‌రెడ్డి

బచ్చన్నపేట, జనవరి 11 : నేటి యువత ఆర్మీలో చేరి దేశానికి సేవ చేసేందుకు ముందుకు రావాలని రిటైర్డ్ ఆర్మీ జవాన్ బొడిగం తిరుమల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇటుకాలపల్లికి చెందిన తిరుమల్‌రెడ్డి ఇటీవల ఉద్యోగ విరమణ పొంది గ్రామానికి వచ్చాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుమల్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా త్యాగం చేసి, దేశ సరిహద్దులో విధులు నిర్వహించడం గౌరవంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

స్టేట్ వెండర్స్ యాక్ట్ అమలు చేయాలి

జనగామ చౌరస్తా, జనవరి 11 : స్టేట్ వెండర్స్ యాక్ట్ 2014ను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు యాటల సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో స్టేట్ వెండర్స్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పండ్లు, కూరగాయలు, సోడా బండ్లు, తోపుడు బండ్లపై వ్యాపారం నిర్వహించుకునే వారికి హాకర్స్ జోన్ ఏర్పాటు చేసి గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లేశ్‌రాజ్, చిరు వ్యాపారుల సంఘం కన్వీనర్ మెండె రమేశ్, కోకన్వీనర్ శంకర్, సునీత, పద్మ, మధు, ధానమ్మ, లక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు చేయూత హర్షణీయం

దేవరుప్పుల, జనవరి 11 : చేనేత కార్మికులకు ప్రభుత్వం చేయూత నిచ్చేందుకు ముందుకు రావడం హర్షణీయమని గూడూరు చేనేత సహకార సంఘం అధ్యక్షుడు రచ్చ కృష్ణమూర్తి అన్నారు. మండలకేంద్రంలో పలు చేనేత సంఘాల ఆధ్వర్యంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ చేనేత అభయహస్తం, చేనేత భద్రత పథకం, నేతన్న భరోసా పథకాలు కార్మికులకు తోడ్పడతాయన్నారు. నేతన్న భరోసా కింద కార్మికులకు రూ.18వేలు, అనుబంధ కార్మికులకు రూ.6వేలు ప్రకటించడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో సీతారాంపురం సంఘం అధ్యక్షుడు మార్గం ఉప్పలయ్య, పలు సంఘాల సభ్యు లు రచ్చ సత్యనారాయణ, కాముని సత్తయ్య, కృష్ణమూర్తి, కోలు పరశురాములు, గర్దాసు రాములు, నల్ల యాదగిరి, బోగ ఉపేందర్ ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జఫర్‌గఢ్, జనవరి 11 : మండలంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులు ఆయా తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఆరో తరగతి చదివేందుకు మొత్తం సీట్లకు, 7వ తరగతి నుంచి 10వ తరగతిలో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు టకు ప్రవేశపరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆయా తరగతుల్లో ప్రవేశాలకు ఫిబ్రవరి 28వరకు దరఖాస్తులు చేసుకోవాలని శ్రీకాంత్ కోరారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 3న హాల్ టికెట్‌లు ఇచ్చి, అన్ని తరగతులకుగాను ఏప్రిల్ 14న మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని ఆయా తరగతుల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట, జనవరి 11 : చాకలి ఐలమ్మ రజక సంఘం కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మినలాపురం చెన్నయ్య, ఉపాధ్యక్షులుగా పెళ్లిమెళ్లి సురేశ్‌బాబు, దేవరకొండ మల్లేశ్, మినలాపురం సిద్ధులు, లింగయ్య, ప్రధాన కార్యదర్శులుగా దేవరకొండ శ్రీనివాస్, పోచంపల్లి వెంకటేశ్, కోశాధికారిగా మినలాపురం రాజు, సలహాదారులుగా రమేశ్‌బాబు, శ్రీనివాస్, బలరాం, భరత్‌ను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శిలు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

13న మండల స్థాయి క్రికెట్, ముగ్గుల పోటీలు

జఫర్‌గఢ్, జనవరి 11 : మండల కేంద్రం జఫర్‌గఢ్‌లో ఈ నెల 13న మండలస్థాయి యువకులకు క్రికెట్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జఫర్‌గఢ్‌కు చెందిన వ్యాపారవేత్త బజ్జూరి అశోక్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల విజేతలకు బజ్జూరి మణికాంత్ తన తండ్రి అశోక్ జ్ఞాపకార్థం నగదు బహుమతిగా గెలుపొందిన జట్టుకు రూ.15,116, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.10,116, ఇవ్వనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వివరాలకు 9618475112ను సంప్రదించాలన్నారు. మండలకేంద్రంలో మహిళలకు నిర్వహించే ముగ్గుల పోటీల విజేతలకు బజ్జూరి మణికాంత్ తన తండ్రి అశోక్ జ్ఞాపకార్థం ప్రథమ బహుమతి రూ.3016, ద్వితీయ బహుమతి రూ.2016, తృతీయ బహుమతి రూ.1016 అందజేయనున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలు జఫర్‌గఢ్‌లోని గాంధీసెంటర్‌లో నిర్వహిస్తామని, పోటీల్లో పాల్గొనే మహిళలు రంగులు వెంట తెచ్చుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

కోర్టుకు పోతేనే పెన్షన్ బెన్‌ఫిట్ చెల్లిస్తారా?

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 11 : న్యాయబద్ధంగా రావలసిన పెన్షన్ పొందడానికి కోర్టుకు వెళ్లితేనో, చనిపోతా అంటేనే పెన్షన్ బెన్‌ఫిట్ అందిస్తారా..? అని ఉమ్మడి వరంగల్ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎం విజేందర్ రెడ్డి, అధ్యక్షుడు ఇనుగాల ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వీ కొమురెల్లి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. చనిపోత అన్నవాళ్లకే పెన్షన్ బెనిఫిట్ చెల్లించడం, ఇతరులకు చెల్లించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రిటైర్డ్ ఏఆర్ ఎస్సై ఎండీ సాదిక్ రిటైర్‌మెంట్ అయి ఎనిమిది నెలలు కావస్తున్నా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాకపోవడంతో విసిగి చెంది ఇక తనకు ఆత్మహత్యే శరణ్యమని బుధవారం వీడియో సోషల్ మీడియాలో పెట్టడడంతో ప్రభుత్వం అదేరోజున రూ.52లక్షలు విడుదల చేయడాన్ని వారు గుర్తు చేశారు. చివరి ఘట్టంలో పెన్షన్ రాక అనారోగ్య సమస్యలను తట్టుకోలేక ప్రశాంత జీవితం గడిపే అవకాశం లేకుండా జీవితంపై చనిపోయేంత విసుగుచెందిన వారికే బెన్‌ఫిట్స్ అందిస్తారా..? అని ప్రభుత్వంపై వారు మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం జనవరి 26వరకు పెన్షన్ బెన్‌ఫిట్స్ చెల్లించని పక్షంలో ప్రభుత్వం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మృత్యువులోనూ వీడని బంధం

గంటల వ్యవధిలో వృద్ధ దంపతుల మృతి



బైకాని కొంరయ్య,సోమక్క(ఫైల్)

పాలకుర్తి, జనవరి 11 : వారు భార్య భర్తలు... మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు... జీవిత బంధంలోనూ అంతే అనుబంధంగా కొనసాగారు... వివాహ బంధంలో ఒక్కటైన ఆ బంధం మరణంలోనూ వీడలేదు. వివరాల్లోకి వెళితే... తీగారం గ్రామానికి చెందిన బైకాని సోమక్క(76) శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందగా, ఆమె భర్త బైకాని కొంరయ్య(79)శనివారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచాడు. దీంతో మండలంలోని తీగారం గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. సోమక్క కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుమార్తె రమ్య తల్లికి వైద్యం చేయిస్తున్నది. సోమక్కకు నయం కాకపోవడంతో శుక్రవారం మృతి చెందింది. దీంతో భార్య మరణం తట్టుకోలేని భర్త కొంరయ్య శనివారం తెల్లవారుజామున గుండె ఆగి మృతి చెందాడు. ఒకరి తర్వాత ఒకరు గంటల వ్యవధిలోనే మృతి చెందడంతో తీగారం గ్రామం దుఃఖ: సాగరంలో మునిగింది.

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ భీంశర్మ

యువత సమయాన్ని వృథా చేయొద్దు : ఏసీపీ

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 11 : యువత సమయాన్ని వృథా చేయకుండా జీవితంలో స్థిర పడడానికి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నించాలని ఏసీపీ భీంశర్మ అన్నారు. శనివారం మండలంలోని చాగల్లు గ్రామంలో ఈ నెల 11నుంచి 13వరకు నిర్వహించనున్న 17వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఏసీపీ భీంశర్మ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడుతూ క్రీడల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సులభమన్నారు. కార్యక్రమంలో సీఐ జీ వేణు, స్వాగత్ యూత్